క్లుప్తంగా

వర్సిటీ అభివృద్ధికి వీసీ కృషి అభినందనీయం



పామర్రు: కృష్ణా యూనివర్సిటీ అభివృద్ధికి వైస్ చాన్సలర్ కేబీ చంద్రశేఖర్‌రావు చేస్తున్న కృషి అభినందనీయమని పద్మశ్రీ ఘంటసాల బాలు స్మారక కళా పీఠం అధ్యక్ష, కార్యదర్శులు కాటూరి వెంకట మురళీ కృష్ణ, టి.మురళీకృష్ణ తెలిపారు. చాన్సలర్ చంద్రశేఖర్‌రావుని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పమాలలతో, శాలువాలతో మచిలీపట్నంలో గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో మంచినీటి సౌకర్యానికి రూ.50లక్షలతో ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. బాలుర, బాలికల హాస్టల్, క్యాంటీన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో అనుమలశెట్టి జగన్మోహన్‌రావు, సాయికిరణ్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



తోట్లవల్లూరు: పదవ తరగతి విద్యార్థులు క్రమ శిక్షణగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక జెడ్పీ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు గురువారం స్పూర్తి స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. ఎంపీపీ, జెడ్పీటీసీ విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఈడ్పుగంటి రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ వైపే జనం



గుడ్లవల్లేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన వైపే జనం ఉన్నారని గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వ పింఛన్లను తొలగిస్తున్నామన్న టీడీపీ నాయకుల ప్రచారాన్ని ప్రజలు విశ్వసించటం లేదన్నారు. మండలంలో మంజూరైన 277 పెన్షన్లను అందించామని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొడాలి సురేష్, వైస్ ఎంపీపీ శాయన రవి, ఈఓపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సచివాలయం వద్ద గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రముఖుడు హనుమార్ పేర్నేడీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో విజయవాడకు చెందిన అను ఆసుపత్రి వైద్యుడు పలు రకాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 300 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

పంచగవ్యతో పలు ప్రయోజనాలు



మండవల్లి: పంచగవ్యతో పలు ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ పృథ్వీ, డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని అల్లినగరం గ్రామంలో పంచగవ్యపై బుధవారం అవగాహన కల్పించి, పంచగవ్య తయారీని సామూహికంగా చేయించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సీఆర్పీ నాగవిజయ, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా
- ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

గుడివాడరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి గుడివాడ డివిజన్ రెవెన్యూ అధికారులు, రైస్‌మిల్లర్లతో గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు గుడివాడ డివిజన్‌లో ఏ మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు, ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లోని రైతుభరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు అందచేసే అన్ని రకాల సౌకర్యాలను ఎప్పటికప్పుడు సిబ్బంది వివరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించి రైతులకు మేలు చేయాలని కోరారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని, ప్రభుత్వ ఆశయ సాధనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆయా కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బందితో ఎప్పటికప్పుడు అధికారులు మాట్లాడి కొనుగోలు, ఇతర వివరాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు రైతులు ధాన్యం విక్రయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కూడా ధాన్యం విక్రయాలకు సంబంధించి దళారులను, బ్రోకర్లను, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, ఆర్డీవో పి.పద్మావతి, సివిల్ సప్లయిస్ డీఎం, గుడివాడ డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్లు కూడా అధికారులకు సహకరించాలి

గుడివాడ డివిజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆయా కొనుగోలు కేంద్రాల పరిధిలోని రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియలో అధికారులకు రైస్ మిల్లర్లు కూడా సహకరించాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా రైస్‌మిల్లర్లను కోరారు. రైస్‌మిల్లులకు తరలించే ధాన్యాన్ని జాగ్రత్తగా కాపాడాల్సిన బాధ్యత మిల్లర్లదేనన్నారు. రైస్‌మిల్లర్లందరికీ గన్నిబ్యాగ్స్, ఇతర వివరాల గురించి ఎప్పటికప్పుడు అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి గాని ఉన్నతాధికారుల దృష్టికి గాని తీసుకురావాలని కోరారు. అధికారులు రైస్‌మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ రైతుల నుంచి సేకరించిన ధాన్యం నిల్వలను జాగ్రత్తగా భద్రపర్చాలని ఆదేశించారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపడమే జగన్ ఆశయం

మండవల్లి: ప్రజలందరి జీవితాల్లో వెలుగులు చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన 265 పింఛన్లను ఎమ్మెల్యే డీఎన్నార్ గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇచ్చిన పింఛను సొమ్మును నాలుగున్నర రెట్లు పెంచడమే కాక వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి అందిస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా అందరికీ పింఛన్లను ఇస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు.
ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) సమావేశానికి అధ్యక్షత వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు జంగం వరలక్ష్మి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, సర్పంచ్‌లు ఎస్.థామస్, బోనం శేషగిరి, ఎస్.నాగరాజు, జి.రత్నకుమారి, ఎస్.ఇస్తేరురాణి, వై.నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్ శ్రీకృష్ణయాదవ్, పి.లక్ష్మీకాంతం, ఎస్.కిరీటిరాజు, డి.రమేష్, కో–ఆప్షన్ సభ్యుడు డి.డేవిడ్ పాల్గొన్నారు.



కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ప్రజాప్రతినిధులు

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు వేగంగా నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సూచించారు. కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌లో నిర్మాణాలు చేపట్టాల్సిన లబ్ధిదారులు, వలంటీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వివిధ శాఖల అధికారులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ లేఅవుట్‌ను 94.5 ఎకరాల్లో ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 2,989 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు కేటాయించామన్నారు.

ప్రభుత్వం ఈ కాలనీకి రూ.168.24 కోట్లు ఖర్చుచేసిందని చెప్పారు. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.లక్షా 80వేలు అందిస్తోందన్నారు. డ్వాక్రా మహిళలకు అదనంగా రుణాలు సైతం మంజూరు చేస్తున్నారని తెలిపారు. త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, సర్పంచ్ దానం నవరత్నకుమారి, తహసీల్దార్ బి.మురళీకృష్ణ, ఎంపీడీవో కె.రామలింగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏపీవో శరణ్, టౌన్ సీఐ ఎంవీఎస్.నాగరాజు, పార్టీ నాయకులు హమీద్, తోట మహేష్ పాల్గొన్నారు.



కైకలూరులో జగనన్న గ్రీన్ విలేజ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మినుము పైరు పరిశీలన

కైకలూరు: మినుము పైరులో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని కైకలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆర్.గంగాధరరావు చెప్పారు. మండలంలోని వింజరం, తామరకొల్లు గ్రామాల్లో మినుము సాగును మండల వ్యవసాయాధికారి ఆర్.దివ్యతో కలసి ఏడీ గంగాధరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో మండలంలో 2,650 ఎకరాలు, కలిదిండి మండలంలో 768 ఎకరాల్లో మినుము సాగవుతోందన్నారు. రైతులు పొగాకు లద్దెపురుగు, మరుకా మచ్చల పురుగుపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని కోరారు.

ఎయిడ్స్, టీబీ వ్యాధులపై అప్రమత్తం అవసరం

భూషణగుళ్ళ(పెదపారుపూడి): భూషణగుళ్ళ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఎయిడ్స్, టీబీ వ్యాధులపై ఏపీ శాక్స్, ఎన్‌పీసీఓ వారి సహకారంతో చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్‌వర్కర్స్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా జోనల్ సూపర్‌వైజర్ పి. వెంకటేశ్వరరావు ఎయిడ్స్, టీబీ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. హెచ్ఐవీ బాధితులను చిన్నచూపు చూడవద్దన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడిన వ్యాధి మరొకరికి సోకదని చెప్పారు. అనంతరం ఎయిడ్స్, టీబీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి ఎం.విజయ్‌కుమార్, ఏఎన్ఎం వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని చొరవతో రోడ్ల నిర్మాణం

గుడివాడరూరల్: మండల పరిధిలోని మల్లాయపాలెం జగనన్న హౌసింగ్ కాలనీలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) చొరవతో రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్టు మండల పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహనరావు తెలిపారు. రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన అధికారులు, సిబ్బందితో కలసి పరిశీలించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ కాలనీలో ఇంటర్నల్ రోడ్లకు ఇప్పటికే వేసిన క్వారీ రబ్బీష్ లేయర్‌పై నూతనంగా జీఎస్‌బీ లేయర్ వేసే పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కాలనీలో ఏర్పాటు చేయనున్న రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రహదారుల నిర్మాణం కోసం గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అత్యంత ప్రాముఖ్యం ఇస్తున్నారన్నారు. జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు అన్ని మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ఎమ్మెల్యే నాని ఆదేశాల మేరకు పని చేస్తున్నామన్నారు. త్వరలోనే రహదారులు, ఇతర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించి లబ్ధిదారులు నివాసం ఉండే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ రామ్మోహనరావు

సమన్వయంతో గ్రామాభివృద్ధి సాధించాలి

కైకలూరు(కలిదిండి): ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధి సాధించుకోవాలని కలిదిండి మండల ఈఓపీఆర్డీ శ్రవణ్‌కుమార్ చెప్పారు. కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామసభ జరిగింది. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఇటీవల పంచాయతీలో విభేదాల కారణంగా ముందస్తు చర్యల్లో భాగంగా కలిదిండి ఎస్ఐ మణికుమార్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపిస్తోందని సభలో కొందరు ప్రశ్నించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర షెడ్డుకు పైకప్పు లేని విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. చెత్త సేకరణలో కీలకభూమిక పోషించే క్లాప్‌మిత్రాలకు జీతాలు అందించాలని నిర్ణయించారు. దళితవాడలో డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయాల నూతన భవన నిర్మాణాలు పూర్తి చేయడం, స్వచ్ఛమైన తాగునీరు సరఫరా వంటి పలు తీర్మానాలు చేశారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన గ్రామసభ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ఆర్‌వి.ఉదయకుమార్, ఉప సర్పంచ్ చెన్నంశెట్టి నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామప్రజలు, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



లోకుమూడిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని లోకుమూడి లో సర్పంచ్ తలారి ధనలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మూడేళ్లలో అందించిన ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. జెడ్పీ, మండల పరిషత్ నిధులు రూ.7లక్షల 25 వేలతో నిర్మితమైన అంగన్‌వాడీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు సంక్షేమ విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, మండల వ్యవసాయ మండలి అధ్యక్షురాలు జంగం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు ప్రారంభం

పామర్రు: మార్గశిరమాసం సందర్భంగా పలు వైష్ణవ ఆలయాలలో ధనుర్మాస పూజలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. స్థానిక విష్ణాలయంలో గురువారం తెల్లవారుజామున ధనుర్మాస పూజలను ప్రారంభించారు. తొలుత మంగళ వాయిద్యాలతో బిందె తీర్థం తీసుకువచ్చారు. ఆ మంత్రజలాలతో గోదాదేవికి విశేష అర్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలను చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు రొంపిచర్ల భార్గవ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మండల పరిధిలోని జమీదగ్గుమిల్లి గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను ఘనంగా ప్రారంభించారు. తెల్లవారుజామున ఆలయంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పఠనం చేసి దానికి తెలుగు అర్థాన్ని ప్రవచించారు. కొరిమెర్ల గ్రామంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పూజలను ఆలయ అర్చకుడు బృందావనం నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయంలో విశేష పూజలను నిర్వహించి భక్తులు బాలభోగాన్ని ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాపర్ల గ్రామంలోని శ్రీ గణ్యశ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను ప్రారంభించామని ఆలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి తెలిపారు. ఆలయంలో పూజలను ఆలయ అర్చకుడు బృందావనం పద్మాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయంలో జనవరి11న కూడారై ఉత్సవం, 14వ తేదీన భోగి పండుగ నాడు గోదాదేవి రంగనాథ స్వాముల కల్యాణ మహోత్సవం జరుగుతాయని తెలిపారు.



రాపర్ల ఆలయంలో సర్వాంగ సుందరంగా అలంకరించిన గోదాదేవి అమ్మవారు

అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు

మండవల్లి: కోడిపందేలు, జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎ.జనార్దనరావు హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకుని అసాంఘిక కార్యక్రమాల నివారణకు 16 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామస్థాయి కమిటీలతో బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల స్థాయి టీమ్‌తో పాటు గ్రామస్థాయి టీమ్‌లు కూడా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షిస్తాయన్నారు. ఎంపీడీఓ పి.మల్లీశ్వరి, ఎస్సై టి.రామకృష్ణ, గ్రామస్థాయి టీమ్‌లు పాల్గొన్నాయి.

ఆవు కడుపులో 150 కిలోల వ్యర్థాలు



ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడు రామయ్య

మచిలీపట్నంటౌన్: నగరంలో సంచరిస్తున్న ఆవులను ప్లాస్టిక్ క్యారీబ్యాగ్‌లు కబళిస్తున్నాయి. ఆహార పదార్థాలను క్యారీబ్యాగుల్లో ఉంచి కొందరు రోడ్లపై పడేస్తున్నారు. వాటిని ఆవులు తినేస్తున్నాయి. ఫలితంగా అవి కడుపులో పేరుకుపోయి ఆవులు అనారోగ్యం బారినపడుతున్నాయి. ఇటీవల ఓ ఆవు అనారోగ్యానికి గురవడంతో కొంత మంది దానిని నగరంలోని గోసంఘానికి తరలించారు. ప్రభుత్వ పశువైద్యుడు రామయ్య ఆ ఆవుకు శస్త్రచికిత్స చేసి పొట్టలో నుంచి 150 కిలోల వ్యర్థాలను బయటకు తీశారు. ఈ వ్యర్థాల్లో ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లు, తాళ్లు ఉన్నాయి.

మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

గుడివాడటౌన్(నందివాడ): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం కూడా అవసరమని నందివాడ మండలం జనార్దనపురం గ్రామ ప్రత్యేక అధికారి స్వర్ణలత అన్నారు. గ్రామదర్శినిలో భాగంగా గురువారం గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితి, మంచినీటి చెరువులలో నీరు నింపుతున్న పనులను, హెల్త్ సెంటర్‌లో వైద్యసేవల తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బోధనా విధానం, మధ్యాహ్న భోజనం అమలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిచాలనేది ప్రభుత్వ ధ్యేయమని, అందుకు అనుగుణంగా వారికి అవి చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, గ్రామ కార్యదర్శి రామ్మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చురుగ్గా పింఛన్ల పంపిణీ

పామర్రు: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛను అందజేయటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నాలుగవ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు నూతన పింఛనులను పింఛన్ వారోత్సవాలలో భాగంగా గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛను పొందాలంటే ఎన్నో కష్టాలు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛను అందజేస్తున్నామని అన్నారు. మండల రైతు సలహామండలి అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, కృష్ణామిల్క్ యూనియన్ జిల్లా బోర్డు సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారురాలికి పింఛను అందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, పార్టీ నాయకులు మర్రెడ్డి అంజిరెడ్డి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, కందుల నరసింహారావు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి పింఛను అందజేస్తున్న వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు తదితరులు

వృద్ధులకు దుస్తుల పంపిణీ



ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదపాలపర్రులో గంటా వెంకటరమణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధులకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ గంటా కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామంలోని 150 మంది వృద్ధులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ కిషోర్ మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే దుస్తులు పంపిణీ చేశామన్నారు.

పామర్రులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సంబరాలు

పామర్రు: పామర్రు నియోజకవర్గ శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షునిగా నియమిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి గురువారం ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో శాసనసభ్యుని కార్యాలయం వద్ద టపాసులు కాల్చి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరుపుకొన్నారు. ఆనందోత్సాహాలతో ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకున్నారు. తొలుత కార్యాలయంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పామర్రులో ఎమ్మెల్యే కార్యాలయం ముందు టపాసులు కాలుస్తున్న పార్టీ శ్రేణులు